కథానిక

# ప్రథమవీక్షణా ఫలితం

తాళ్లూరు నాగేశ్వరరావు

తలవని తలంపుగా సంభవించిన మొదటిచూపుల వల్ల ప్రేమలు అంకురించి, పెరిగి పెద్దవై, అనురాగాలు అభివృద్ధియై — తమ జీవితాన్ని ఆనందమయంచేసుకున్న దంపతున్నారు. కాని ప్రథమ వీక్షణంలోనే ఒకరి హృదయాలను ఒకళ్లకు అర్పితంచేసుకుని, ఉక్కు గోడలవంటి మనుషుల అడ్డువల్ల ప్రేమలు ఫలించక—తమ జీవితాన్ని విషాదమయంచేసుకున్న భగ్నహృదయులుకూడా లేకపోలేదు.

*　　*　　*

సుశీలరావు తత్తరపాటుతో టికెట్టు తీసుకోబోతూండగా ప్లాట్‌ఫారంమీద ట్రెయిన్ కూత వేసింది. బయలుదేరిన బండిలో పరుగెత్తుకుంటూ ఎక్కాడు సుశీలరావు. అది సెకెండుక్లాసు బోగీ. పట్టుకున్న పెట్టె చువ్వవదిలి లోపలకు అడుగు పెట్టాడు. ఏదో మ్యాగజీన్ చదువుకొంటూన్న పదహారేండ్ల యువతి అప్రయత్నంగా పెట్టెలోకి వచ్చిన నూతనవ్యక్తి ముఖంలోకి అర నిముషంలో సగంసేపు దృష్టి నిలిపిచూసింది. సుశీలరావు ఉక్కిరిబిక్కిరై ఆమెకేసి తెరిచివుంచిన నేత్రాలను అల్లానే ఉంచాడు. ఆమె తలవంచుకుంది.

ఎవరామె? తనవంక ఎందుకలా చూసింది? తల ఎందుకు వంచుకుంది? ఒకప్రక్క హృదయం అవ్యక్తమైన ఆనందంతో నిండి, మనిషినంతా ఉత్సాహంతో కలవరపెడుతూన్నా సుశీలరావుకు ఎందుకో వేధవ ప్రశ్నలు కలిగినయ్, మనస్సులో నవ్వుకుంటూ ఎదురుగా సీటుమీద కూర్చున్నాడు. ఆమె ప్రక్కనే ఒక పదేళ్ళ పిల్ల ఉంది. వీళ్ళు ముగ్గురూకాక ఇంకా ఆ పెట్టెలో అరవైయేళ్ళ పురుషుడున్నాడు. ఆయన ఆమె తాలూకు కాదని సులభంగానే తెలుసుకోవచ్చు. సుశీలరావు ఆగమనం ఆయన పత్రిక చదువుకు ఏవిధమైన అడ్డంకునూ కలిగించలేదు. రైలువేగం హెచ్చింది.

తననుచూసి సిగ్గుపడుతూన్నదని ఇట్టే గ్రహించాడు సుశీలరావు. హృదయంలో గర్వం, సంతోషం! కిటికీవైపుకు ముఖం తిప్పుకొని మనసారా నవ్వుకున్నాడు.

మళ్ళా తనని అట్లా-కళ్లల్లో చూడాలి? ఎంత చక్కనిముఖం! అద్దంలా ప్రతిబింబించే నునుపు చెక్కిళ్లు—సిగ్గుకు ఎట్లా కందిపోయాయో! కళ్లల్లో ఏదో గంభీరమైన సౌందర్యం ఉంది. కాంచనమాల కనురెప్పల సొగసును మించిన కనురెప్పలు. 'నాజూకైన తలకట్టు. పచ్చని శరీర కాంతి. విలువగల పల్చటి చీరెచాటున ఉన్న, ఏ పురుషుణ్ణయినా మంత్రబద్ధునిగా చేసే అవయవాల సౌష్టవం. మెడలో నెక్‌లెస్—ఉబికే వక్షంపైన అందమైన నీడల్ని పరుస్తోంది. అప్సరసల అందమంతా రాసిపోసి సృష్టించిన కన్యా—ఈమె! తలుచుకున్నకొద్దీ సుశీలరావుకు ఒళ్లు జలదరిస్తోంది. మళ్లా తన కళ్లల్లోకి ఆమె చూడాలనీ, తను ఆమె కళ్లల్లోకి చూడాలనీ-ఉబలాటపడుతున్నాడు. పత్రికచాటున దాచుకున్న ముఖాన్ని తియ్యలేదు ఆమె.

బండి రెండుస్టేషన్లలో ఆగి, బయలుదేరింది. సుశీలరావు ఆమెనుంచి అందమైనచూపుకు కాచుకొని కూచున్నాడు. చిన్న దగ్గు దగ్గాడు. అవతల మనిషితో విచిత్రమైన సంభాషణ పెట్టుకున్నాడు. కాని ఆమె సుశీలరావు కేసిచూడలేదు. పత్రిక చదువుతూన్న ఆమె అర్ధనిమాలిత నేత్రాలను చూసి మురిసిపోయాడు. అజంతాకన్యల నేత్రాల తీరు ఆమె నేత్రాలలో ఉందని అనుకున్నాడు. విసుగేసింది, సుశీలరావుకు—ఎంతసేపటికీ తనవంక చూడలేకపోయేటప్పటికి.

తను దిగవలసిన స్టేషన్‌లో బండి ఆగింది. బోగీనుంచి దిగబోతూ అనుకున్నాడు. ఇరవై

సంవత్సరాల జీవితంలో ఏ స్త్రీని చూసినా కలుగని అనుభూతీ, ఒకవిధమైన ఆనందమూ—ఈమెను చూడటంలో తనకెందుకు కలగాలి?

పెట్టెదిగి ప్లాట్ ఫారంమీద నిలుచొని ఆఖరి సారిగా ఆమెవైపు చూశాడు సుశీలరావు. ఆమె అదే సమయానికి పత్రిక తొలగించి ప్లాట్ ఫారం మీద వున్న సుశీలరావుకేసి చూడటం జరిగింది. సుశీలరావు సంతోషం భరించలేక వెర్రికేకలు పెట్టాడు. కాని అవి నోరుదాటి బయటకు రాలేదు. హృదయంలోనే ఉండిపోయాయి. ఆమెను తనంటే నిజంగా...రోడ్డుమీదనడుస్తోనే ఆమెనుగురించి పగటికలలుకనటం మొదలెట్టాడు సుశీలరావు.

సుశీలరావును తనఇంటికిరమ్మని కబురుచేశాడు అతని మామయ్య నాగభూషణం. ఇంటికిరమ్మనటంలోగల అంతర్యం సుశీలరావుకు తెలుసు. ప్రక్క గ్రామంలో ఒక పెళ్ళిసంబంధం ఉందిట, చూసేందుకు. తలిదండ్రులకు చెప్పకుండావచ్చేశాడు సుశీలరావు. కట్నంకోసం తలిదండ్రులు గాలించేసంబంధాలు పనికిరాక—సుశీలరావు నవీన భావాలుకల యువకుడు కనుక, మంచిపిల్లను వెదికిపెట్టే బాధ్యత తనతో అభిమానంగాఉండే మామయ్యమీదవేశాడు.

* * *

మరునాడుఉదయం ఆవూరువెళ్ళాను. నిన్న చూసిన స్త్రీ మూర్తి సుశీలరావు మనస్సులో హత్తుకుపోయి-వాస్తవానికి అతనికి పెళ్ళికూతుర్ని చూడాలనేకుతూహలాన్ని తగ్గించింది. మామయ్య మాట తీసివేయలేక వెళ్ళవలసివచ్చింది.

“రండి, రండి—”వధువు తండ్రి అతి ఆప్యాయంగా ఆహ్వానించి, అతిధులకోసం అందంగా అమర్చిన కుర్చీలుచూపించాడు. నాగభూషణమూ సుశీలరావూ కూర్చున్నారు. తను కొద్దినిముషాల్లో చూడబోయే పెళ్ళికూతుర్నిగురించి వూహించాల్సిన అవసరానికి సుశీలరావు గురికాకపోవటానికి నిన్న రైల్లో ప్రథమవీక్షణంలోనే ప్రేమపాఠాలు నేర్పిన నిసర్గసౌందర్యవతే కారణం.

యధాలాపంగా కొంత సంభాషణ జరిగింది. నాగభూషణం-వధువు తండ్రీ మధ్య. సుశీలరావు కొన్నిమాటలుమాత్రం వినగలిగాడు.

“పిల్లనుచూపిస్తారా”అన్నాడునాగభూషణం. వధువు తండ్రి నవ్వుతూ ద్వారానికి కట్టివున్న రంగులతెరని తొలగించుకొని లోపలికెళ్ళాడు.

“ఇల్లు బాగానేఉంది” అన్నాడు నాగభూషణం సుశీలరావుతో. “ఊం!”అన్నాడు సుశీలరావు.

ఉన్నట్టుఉండి ఒక్కసారి లేచిపోవాలనే భావావేశం సుశీలరావును ఆవరించింది. ఎల్లాగైనా ఆ పిల్లనే వివాహంచేసుకోవాలి. మిగతా యువతుల్ని తను చూడక్కర్లేదు. ఆమెలాంటివాళ్లు ఆంధ్రదేశంలో ఇంకా ఉండివుండబోరు.

“మామయ్యా!”అన్నాడు సుశీలరావు.

“ఏమిటి?”అన్నాడునాగభూషణం ఉలిక్కిపడి. ఏం మాట్లాడలేదు, సుశీలరావు. తను అనాగరికంగా ప్రవర్తించబోతున్నాడని తెలుసుకొని ఊరుకున్నాడు.

పెళ్ళికూతుర్ని తీసుకొచ్చి కుర్చీలోకూర్చోబెట్టింది, వాళ్ళతల్లి. సుశీలరావు చూసి, స్తంభించి పోయాడు.సంతోషంతో శరీరం గగుర్పొడిచింది. తను అదృష్టవంతుడు. తనుకన్నకలలు నిజమైనై! తనజీవితం “కామెడీ”అయ్యేదినంవచ్చింది! ఆమే-ఈమె! ఆశగా ఆమెకేసి పలుచని చిరునవ్వుతో చూశాడు, సుశీలరావు...ఆ చూపుకోసం. అతి సున్నితంగా, మెల్లగా, సోగనేత్రాలెత్తి, ఓరగా, విలాసం వుట్టిపడుతూండగా పెళ్ళికుమారుణ్ణి చూసి, సన్నని మందహాసంతో తలదించుకుంది ఆమె. రైల్లో ఆమె అప్పుడు కనపర్చిన సిగ్గు సుశీలరావుకు గోచరించింది. అనుకోనిగుర్రాల ఆకస్మిక విజయం! జీవితం మొత్తానికీ సగర్వమైన స్మృతిగానిలిచే సంఘటన—కొన్నికొన్ని సమయాల్లో అతిదుఃఖాన్ని భరించడం ఎంత అవస్థో, అతి ఆనందాన్ని భరించడంకూడా అంత అవస్థే. అంతే అయింది సుశీలరావుపని.

“మామయ్యా! ఎలాగైనా, కట్నం ఎంత తక్కువైనాసరే, ఈ సంబంధాన్ని కుదుర్చు” అన్నాడు సుశీలరావు మామయ్యతో చాటుగా. నాగభూషణం నవ్వుకున్నాడు.

సంబంధం స్థిరపర్చాడు, నాగభూషణం. మంచి రోజుచూసి లగ్నంపెట్టుకోవటమేఆలస్యం అన్నాడు పెళ్ళికూతురు తండ్రి. మళ్ళీ ఆమె నుంచి ఆ చూపుకోసం సుశీలరావు నిరీక్షించాడు

కాని, ఆమెను మళ్ళీచూసే భాగ్యాన్ని కలిగించకుండా ఇంటికితీసుకొచ్చాడు, నాగభూషణం.

* * *

"అన్నివిధాలా నచ్చిన సంబంధం. పిల్లలో అందానికి ఏ లోటూలేదు. మనకు కావల్సిన కట్నం వస్తుంది"అన్నాడు సుశీలరావు బాబాయి, అన్నయ్యతో.

సుశీలరావుతండ్రి తల ఆడించుతున్నాడు."అయితే ఆసల్యం ఎందుకు? వెంటనేవెళ్లి లగ్నం పెట్టుకు రండి''అన్నది సుశీలరావు తల్లి.

అప్పుడే ఊరినుంచి వచ్చి గది బయటవుండి విన్న ఈమాటలు సుశీలరావులోజ్వాలల్ని సృష్టించాయి. ఏమి సంబంధం? వీళ్ళేమిటి తనకి సంబంధాలు కుదర్చనవసరంలేదు. తనూ, మామయ్యా కుదుర్చుకువచ్చారు అతనికి నచ్చినపిల్లను. ఏమైన తను ఆ పిల్లను పెళ్ళి చేసుకుతీరాలిసిందే! తనని ఎవరూ అడ్డుపెట్టరాదు. అడ్డుపెట్టినా ఆగేదిలేదు ఆ పిల్లకోసం ఏ త్యాగమైనా తను చేయటానికి సంసిద్ధం. తనలోనిప్రేమ హృదయపూర్వకంగా వాంఛించి నిర్ణయించిన వధువు ఆమె.

సుశీలరావు గదిలో అడుగుపెట్టాడు.

తాము ఏకగ్రీవంగా అన్ని శ్రేయస్సులూకోరి నిర్ణయించిన పెళ్లి సంబంధాన్ని గురించి తల్లీ, తండ్రీ, బాబాయీ అతనికి చెప్పారు. చివరకు తండ్రి అన్నాడు, "ఇదివరకే లగ్నం పెట్టుకు వచ్చేవాళ్ళమే! ఏదో పోతూపోతూ నీ అభిప్రాయము కూడా కనుక్కుపోదామని—''

సుశీలరావు ముఖం చిట్లించుకున్నాడు.

"మీరు నాకేమీసంబంధం నిర్ణయించనక్కర లేదు. నేనూ మామయ్యా నిర్ణయించాము. ఏమయినా నేనా పిల్లనే వివాహం చేసుకుతీరాలి" అన్నాడు సుశీలరావు.

అందరి ముఖాలు ఆశ్చర్యాలతో జేవురించాయి. గంభీరమైన ముఖంతో నిశ్శబ్దంగా వున్నాడు సుశీలరావు.

''అయితే కట్నం ఏమాత్రం?''అన్నది తల్లి.

"కట్నం ఎంతైతేం. పిల్లనాకు నచ్చింది."

"అదికాదురా-అసలు కట్నం ఎంతా, అని" అన్నాడు తండ్రి.

"అయిదువేలు."

తెరిచిననోళ్లు తెరిచినట్టుగానేఉండిపోయాయి తలిదండ్రులకు. "వీల్లేదు! బి.ఏ. చదవటమేమిటి? పదిహేనెకరాల ఆస్తి గలవారి కొడుకు కావడమేమిటి? అందచందాల్లో లోటులేనివాడు కావటమేమిటి? అయిదువేలు కట్నమా? ఇదివిన్న ప్రతివాడూ నవ్విపోతాడు. నా వంశంలో ఇటువంటి వివాహం ఎన్నడూ జరగలేదు. ఇప్పుడు కూడా జరగటానికి వీల్లేదు. అంతకు అంత ఆస్తి తీసుకువచ్చే పిల్ల రావల్సిందే!"తలిదండ్రులు నయాన, భయానకూడాచెప్పిచూశారు. బాబాయి తను కుదిర్చిన సంబంధానికి వంకపెట్టాల్సిన పని లేదని నచ్చచెప్పాడు.

"మీ మాటలు నేనువినను."అని ఖచ్చితంగా చెప్పాడు సుశీలరావు.

తరువాత పెద్దమనుష్యులచేత చెప్పించాడు సుశీలరావుతండ్రి. సుశీలరావు గురువైన సుబ్బరామశాస్త్రిచేత చెప్పించాడు. కాని ఏంలాభం లేకపోయింది. తన స్థిరసంకల్పాన్ని చెడగొట్టటానికి మానవమాత్రులు చాలరని చెప్పాడు సుశీలరావు. తండ్రి తిట్లు తిట్టాడు. తల్లి కన్నీరు కార్చింది. ఫలితం శూన్యం.

మూడోరోజు నాగభూషణం వచ్చాడు. సుశీలరావును చాటుగా పిలిచి అన్నాడు, "మనకాసంబంధం ఏమంతబావుండలేదు. తరువాతనేను ఆ కుటుంబం యొక్క ఆచూకీ తీశాను. ఆ కుటుంబంమీద ఊళ్ళో చెడ్డపేరున్నదట. తల్లి సత్ప్రవర్తన కలదికాదుట. ఆ అయిదువేల కట్నం ఇచ్చేది కూడా నిజమని నమ్మటానికి వీల్లేదుట."

సుశీలరావు హృదయంలో రాయిపడింది. అయినా తమాయించుకున్నాడు. వీటన్నిటితో తనకేం సంబంధం? తనకు కావల్సింది ఆమె! ఆమె అందమైన చూపు! ఆమెతోడి జీవితం! మిగతా వాటితో తనకి నిమిత్తంలేదు.

"ఫర్వాలేదు. ఆ సంబంధాన్నే స్థిరపరచు. లగ్నం పెట్టుకు రాండి. నేనుజీవితంలో ఆమెను తప్ప మరో యువతిని పెండ్లాడను" అని రాయి గుద్దిచెప్పాడు సుశీలరావు.

"సరే. నీ యిష్టం."

నాగభూషణం ఈ విషయం సుశీలరావు తలిదండ్రులకు కూడా చెప్పాడు. వాళ్లు తొక్క త్రొక్కిన త్రాచులాగ లేచారు. తమ అయిష్ట

తను మరింత పెంపొందించుకున్నారు.

"నువ్వు వెళ్లి లగ్నం కుదుర్చు మామయ్యా! పెళ్లి చేసుకునేది నేనుకాని నా తలిదండ్రులు కాదు" అన్నాడు సుశీలరావు.

నాగభూషణం వెళ్ళాడు.

*　　*　　*

మూడోరోజు మామయ్య వద్దనుంచి ఒక ఉత్తరంవచ్చింది సుశీలరావుకు. సుశీలరావు ఉత్తరము వస్తుందని ఎన్నడూ అనుకోలేదు. ఆదుర్దాగా విప్పిచూశాడు.

"ఈ ఉత్తరం వ్రాయటానికి చేతులు వొణుకుతున్నాయంటే నమ్ము. వ్రాయకతప్పదు కనుక ధైర్యం చేసుకొని వ్రాస్తున్నాను. ఈ ఉత్తరం చదివి నీవు బాధ పడవొద్దు. జీవితంలో ఇటువంటి దెబ్బలు తగలటం సహజం కాకపోయినా, తగిలితే మనం ధైర్యం చేసుకొనివుండటం తప్ప నిరాశ పడటంవల్ల యేం లాభంలేదు. మనం అటు నిర్ణయించిన సంబంధం వెనక్కు తిరిగింది. నేను వెళ్ళి విచారించాను. వాళ్లు ఇంకో సంబంధం నిశ్చయించారుట. లగ్నం ముహూర్తం కూడా నిర్ణయమైందట. కాని నువ్వు ఈ ఉత్తరంచూసి ఎటువంటి బాధా వుంచుకోవద్దు. ఇంతకన్న మంచి సంబంధం నిర్ణయించుతాను. ఆంధ్ర దేశంలో అందమైన ఆడపిల్లలకేం తక్కువ?" సుశీలరావు కుర్చీలో కూలిపోయాడు.

"అదేమిట్రా?" తల్లి చూసి విస్తుపోయింది. తండ్రిఉత్తరమంతా చదివిగ్రహించినవ్వాడున్నాడు.

"నీ కెందుకురా విచారం. పెళ్ళికాదనా? బాబాయి కుదిర్చిన పిల్లనుచూస్తే నువ్వు భూమి మీద ఆగుతావుట్రా! మంచిపనే జరిగింది. ఇంకేం! ఏవిచారమూ పెట్టుకోకుండా ఆపాలెం సంబంధాన్నే చేసుకో!" అన్నాడు తండ్రి.

*　　*　　*

"ఈ డ్రాయరుమీద పెట్టిన బ్యాగ్ యేదీ?" బిగ్గరగా అరిచాడు సుశీలరావు.

"తీసి బీరువాలో పెట్టాను" అన్నది భార్య.

"ఎందుకు తీసావ్? బుద్ధిలేదూ ఎన్నిసార్లు చెప్పాలి. నేచేసినపనికి ఎదురు చేయవద్దని" ప్రతి చిన్నవిషయానికీ భార్యమీద పోట్లాటే. అనవసరంగా తిడతాడు. కొట్టబోతాడు.

"బీరువాలోంచి తీసుకువచ్చి డ్రాయరుమీద పెట్టింది బ్యాగ్‌ను. "ఎక్కడికి కెళతారు?" అన్నది మెల్లగా.

"వాగులోకి ఎక్కడికెళ్ళితే నీకేం?—దాపురించావు నా జీవితానికి అగ్నిగా, నా జీవితాన్ని నాశనంచేశావు. నువ్వు లేకపోతే నేను హాయిగా ప్రేమించిన యువతిని పెళ్ళి చేసుకొని సుఖంగా ఉండేవాణ్ణి" ఆమె మంచంమీద బోరగిలబడి బావురుమని యేడ్చింది. ప్రతి స్వల్పవిషయానికీ ఇంతే! భార్యఅన్న తరువాత ముద్దూ ముచ్చటా ఉండక్కర్లా? మాట్లాడితే కోపం. కదలితే కోపం ఏపనిచేసినా కోపం! ఎంతభాగ్యం ఉండిమాత్రం యేంలాభం ఈ భర్తక్రింద తన జీవితం, దుఃఖమయ మౌతూన్నది.

"ఏడువ్! ఎప్పుడూ యేడ్పే! ఋన రెండు జీవితాలూ ఏడ్పులోనే అంతమవుతాయ్! అట్లా రాసివుంది. నాగుండెలో జ్వాలల్ని రేపటానికే నీవు నాకు భార్యగా వచ్చావు." ఇదే ధోరణి. ఆమె భార్యగా రావటం నేరంక్రింద నిర్ణయించి ఆమె జీవితాన్ని నరకంపాలు చేస్తున్నాడు సుశీలరావు. తను ప్రేమించిన యువతిని పెళ్ళి చేసుకోకపోవటం ఈమె కారణమని ఏకారణం లేకుండా నిందిస్తాడు. తనుకన్న కలలు నిజం కాకపోయేసప్పటికి, తను ప్రేమించిన యువతి హృదయంలో 'రూపం'గానే ఉండిపోవటం చాత—సుశీలరావు ఈ విధంగా మారాడు. తలిదండ్రులు భార్యగా మెడకుకట్టిన ఆమె జీవితంలో తన జీవితంయొపాటు నిప్పులుపోశాడు. తను సుఖానికి దూరమై ఆమె సుఖానికి విఫలం కలిపిస్తున్నాడు.

"పనిమీద వూరు వెళుతున్నాను" అని చెప్పి బ్యాగ్ తీసుకెళ్ళిపోయాడు, సుశీలరావు.

"అన్నంతిని వెళ్లండి" అని భార్య అన్నమాట గాలిలో కలిసిపోయింది. ద్వారంలో కళ్ల నీళ్లతో కొంచెంసేపు నిలుచుని యింట్లోకి నడిచింది.

సుశీలరావు వెళ్ళినపని అక్కడకాలేదు. మేనేజరు రేపటివరకూ వాయిదా వేశాడు.

"ఈరాత్రికి మాయింట్లో వుండండి. రేపు పది గంటలకల్లా మీపనిచేసి, మమ్మల్ని పంపిస్తాను" అన్నాడు మేనేజరు.

ఇక తప్పేదిలేదు కనక "సరే" అన్నాడు. మేనేజరు తన యింటికి తీసుకెళ్లాడు. వరండాలో

అడుగుపెట్టగానే నిర్విణ్ణుడయ్యాడు, సుశీలరావు. ఆమె కనబడింది. రైల్లో తొలిచూపులోనే ప్రేమను ప్రసాదించిన... జీవితంలో ఆశలు రేపి, పాతాళానికి కూలదోసిన ఆమె... కుర్చీలో కూర్చుని ఏదో చదువుకుంటూన్నది. మేనేజరుగారి భార్యా? సుశీలరావు ఒళ్ళు మండిపోయింది. తననెందుకు పెళ్ళి చేసుకోలేదు? ఈ నలభైయేళ్ళవాడితో ఏం సుఖం కనపడింది.

సుశీలరావును చూసి ఆమె చలించింది. కాని అరనిముషంలో సగంసేపుకూడా నిలిచి అతని వంక కళ్ళెత్తిచూడలేదు. లేడిలా బెదురుతూ ఇంట్లోకెళ్ళింది. సుశీలరావుకు కోపంతో ఒళ్లు తెలీలేదు. అప్పుడే తనని మరిచిపోయింది! తన జీవితాన్ని నాశనంచేసి... జీవితంలో తీరని అశాంతిని తెచ్చిపెట్టి...

ఆ రాత్రి మళ్ళా కనుపించలేదు సుశీలరావుకు ఆమె. భోంచేసేప్పుడు కూడా కనపడలేదు. పనిమనిషి వడ్డించే యేర్పాటుచేశాడు మేనేజరు. ఆమెను కలుసుకోవాలి తను! మనస్సులోని అక్కసంతా వెళ్ళగక్కి, ఆమె నేరాన్ని కళ్ళకుకట్టినట్టు బయటపెట్టాలి? ఎట్లా కలుసుకొనేది?... ఎట్లా కలుసుకోనేది? రాత్రి పదకొండు గంటల వరకూ ఇదే ఆలోచన సుశీలరావుకు. నిద్ర పట్టటంలేదు. ఆమెతో మాట్లాడాలనే ఉత్కంఠ ప్రతి అవయవంలోనూ బాధను కలిగిస్తుంది.

ప్రక్క గదిలోంచి ఏడుపు వినపడ్డది. ఆమె ఏడ్పే. ఉలిక్కిపడి లేచికూర్చున్నాడు సుశీలరావు. ఏవో మాటలు సన్నగా వినిపిస్తున్నాయి, మేనేజరు కాబోలు అంటున్నాడు.

"నీకెన్నిసార్లు చెప్పాలి. నేను ఆఫీసునుంచి వచ్చేవేళకు బయటకూర్చోవద్దని. 'నాతో పెద్ద మనుషులు వస్తూవుంటారు. వీళ్ళందరినీ నీవు సింగారించుకొని ఆహ్వానించేట్టు ఎదురుగ్గా కూర్చోవటమా? ఎన్నిసార్లు చెప్పానే భడవా... ఇక ఎప్పుడూ అట్లా చేయవుగద!" కొడుతున్నాడా? వెధవ! రాక్షసుడు, ఆమెను. తను ప్రేమించిన ఆమెను. దుర్మార్గుడు... ఎట్లా కొడుతున్నాడు? రోజూ ఇంతేనా? ఆమె జీవితాన్ని నాశనంచేస్తున్నాడు. అనవసరంగా అనుమానపడుతూ ప్రతివిషయంలోనూ ఆమెను రాచి రంపాన పెడుతున్నాడు. ఆమె తనది. తననిపొందలేకే... ఇట్లా అతని కర్కత్వానికి బలియైయుంటుంది. ఏదో అంటూన్నది.

"మీరు ప్రతిసారీ, ప్రతిస్వల్పవిషయంలోనూ ఇట్లా కలుగజేసుకొని నన్ను హింసిస్తూంటే, ఇక నేను ఏ బావిలోనైనాపడి జీవితాన్ని ముగిస్తాను. తొలిచూపులోనే ప్రేమలుగలిసి - అదృష్టాన నాకు భర్తగారాబోయే యువకుణ్ణికాకుండాచేసి మీరు నా తలిదండ్రులకు ఆస్తి ఆశచూపి, నా జీవితాన్ని నిలువుగా నాశనంచేశారు. రోజూ నాకు నరకంచూపిస్తున్నారు. ఇక నేను బ్రతకను..." వెక్కివెక్కియేడుస్తూ అంటూన్నదామె భర్తతో.

"ఎవరే నిన్ను ప్రేమించిన ఆ దౌర్భాగ్యుడు. ఇంకేం? చేసుకోకపోయావా? ఇక్కడ నన్ను చంపుకుతినటానికి దాపురించి, ఎప్పుడూ ఏడుపులతో, భయంకరమైన చూపులతో నన్ను వేధించకపోతే? ఇదిగో చూడు! ఇంట్లో పెద్ద మనిషి ఉన్నాడని ఊరుకున్నాను లేకపోతే-నీ అంతు కనుక్కునేవాణ్ణె ఇవాళ. ప్రతిసారీ నేను ప్రేమించిన యువకుడు... నేను ప్రేమించిన యువకుడు... అంటున్నావు. ఈ తడవ వాడి పేరెత్తావంటే నీ నోట్లో రక్తం చూశానే. జాగ్రత్త. నువ్వు నా భార్యవు. పరాయివాడి పేరెత్తటానికి వీల్లేదు" అంటున్నాడు మేనేజరు.

సుశీలరావుకు శరీరమంతా కోపంలో ఉడికిపోతున్నది. ఆ మేనేజరు గొంతుపిసికి బావిలో పారేస్తే... ఆమెను, తనకోసం జీవితాన్ని విషాదమయం చేసుకున్న ఆమెను... తను చేరదీస్తే... కాని సుశీలరావు ఏంచేయలేకపోయాడు!

ఆ నిశిరాత్రే తలుపు తెరచుకొని గడిదాటి, గోడదూకి స్టేషనుకుజేరి తెల్లవారఝామున నాలుగున్నర బండిలో ఎక్కి కూర్చున్నాడు.

*          *          *

తలవని తలంపుగా సంభవించిన మొదటి చూపువల్ల ప్రేమలు అంకురించి, పెరిగి పెద్దవై, అనురాగాలు అభివృద్ధియై తమజీవితాల్ని ఆనందమయం చేసుకున్న దంపతులున్నారు. కాని మొదటి చూపులోనే ఒకరి హృదయాలను ఒకరికి అర్పితం చేసుకుని ఉక్కుగోడలవంటి మనుషుల అడ్డువల్ల ప్రేమలుఫలించక తమ జీవితాల్ని విషాదమయంచేసుకున్న భగ్నహృదయులుకూడా లేకపోలేదు.